క్లుప్తంగా

పారదర్శకంగా ఇళ్ల స్థలాలు కేటాయించాం


మాట్లాడుతున్న సర్పంచ్ భాస్కరరావు

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో ఇళ్ల స్థలాల కేటాయింపులు పారదర్శకంగా జరిగాయని ఆగ్రామ సర్పంచ్ పతివాడ భాస్కరరావు తెలిపారు. నరవలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల స్థలాలకు లాటరీతీసి లబ్ధిదారులకు కేటాయించామని చెప్పారు. ఇళ్ల పట్టాల కోసం తాము ఎవరి నుంచీ డబ్బులు తీసుకోలేదన్నారు. కొంతమంది తనపై అక్కసుతో, రాజకీయ దురుద్దేశంతో తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశానని చెప్పారు.నాయకులు ఎస్.తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత


రక్తదాతలను అభినందిస్తున్న సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

గజపతినగరం: రక్తదానం చేయడం సామాజిక బాధ్యత అని, రక్తదానం ప్రాణదానంతో సమానమని సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్ అన్నారు. మండల కేంద్రంలోని మెంటాడ జంక్షన్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 25 మంది యువకులు రక్తదానం చేశారు, సేకరించిన రక్తాన్ని విజయనగరానికి చెందిన ఎన్.వి.ఎన్ బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు విశ్వనాథ్, ప్రసాద్, డి.వి.ఆర్.నాయుడు, శ్యామ్, ఎన్.వి.ఎన్. బ్లడ్ బ్యాంక్ మేనేజర్ టి.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు విద్యాసామగ్రి పంపిణీ


పుస్తకాలు,పెన్నులు పంపిణీ చేస్తున్న ఎఫ్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరినాయుడు

బొండపల్లి: ఒంపల్లిలోని బ్రైట్ ఫ్యూచర్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న శాంతినివాస్ అనాథ ఆశ్రమంలో విద్యార్థులకు ఫోకస్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్(ఎఫ్‌హెచ్‌ఆర్‌సీ) రాష్ట్ర అధ్యక్షుడు కొత్తలి గౌరినాయుడు, గజపతినగరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీరామ్మూర్తి ఆదివారం పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అనాథలకు అండగా నిలవడంలోనే తృప్తి ఉందని, ప్రతి ఒక్కరూ ఇటువంటి సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని కోరారు. సేవా సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు వితరణ


స్టీల్ సోఫాలు, బారికేడ్లను పోలీస్ అధికారులకు అందజేస్తున్న క్రెడిట్ యాక్సెస్ ఇండియా గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు

గజపతినగరం: క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీ గజపతినగరం బ్రాంచ్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా స్థానిక రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌కు త్రీసీటర్స్ స్టీల్ సోఫాలు-2, అయిదు బారికేడ్లను ఆదివారం వితరణ చేశారు. క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులకు ఎస్‌ఐ కె.లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీ విశాఖపట్నం డివిజనల్ మేనేజర్ వెంకటరమణ, లైజనింగ్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఏరియా మేనేజర్ చక్రధరరావు, బ్రాంచ్ మేనేజర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి కూడలి వద్ద పెదమాపురం ఎస్‌ఐ జయంతి, పోలీస్ సిబ్బంది ఆదివారం రాత్రి వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనచోదకుల లైసెన్స్, వాహనాల పత్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానిపై చర్యలు తీసుకుంటామని, వాహనాల్లో అక్రమంగా మద్యం తరలిస్తే కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని అన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

- ప్రకృతి వ్యవసాయ పంట ఉత్పత్తులతో ఆరోగ్యం
- మెరకముడిదాం మండలంలో విస్తరిస్తున్న ప్రకృతి సేద్యం
- సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న ఆకుకూరలు, కూరగాయల పంటలకు భలే గిరాకీ


కూరగాయలు

ప్రకృతి సేద్యం... ఆరోగ్య భాగ్యం


యాడిక గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బహుళ పంటల సాగు


జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతు

మెరకముడిదాం: పంటల సాగులో మితిమీరిన రసాయన ఎరువులను వినియోగించడం వల్ల ఆపంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటున్న ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు అధికంగా ఉండడమే ఇందుకు కారణమని వైద్యులు చెబుతున్నారు. సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఇతర పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యులు సూచిస్తుండడంతో ప్రకృతి వ్యవసాయ పంటలకు మార్కెట్‌లో మంచి గిరాకీ లభిస్తోంది. ఈనేపథ్యంలో రైతులు క్రమంగా ప్రకృతి వ్యవ సాయం వైపు మొగ్గు చూపిస్తున్నారు. మెరకముడిదాం మండ లంలో ప్రకృతి వ్యవసాయం విస్తరిస్తోంది. యాడిక,గరుగుబిల్లి, సాతాంవలస, భీమవరం, తదితర గ్రామాల్లో రైతులు ప్రకృతి సేద్యం చేస్తున్నారు. రైతులు సుమా రు 36 ఎకరాల్లో బహుళ పంటల విధానంలో వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల పంటలను సాగు చేస్తున్నారు. సేంద్రియ ఎరువులను వాడుతూ పంటలను తెగుళ్ల బారినుంచి కాపాడుకుంటున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తూ నిరంతర ఆదాయం పొందుతున్నారు. స్వచ్ఛమైన పంట ఉత్ప త్తులు కావడంతో వీటికి ధరలు కూడా ఎక్కువగానే ఉంటున్నాయి. మండలంలోని రైతులు ప్రకృతిసేద్యం ద్వారా సాగుచేసిన కూరగాయలను 'ప్రకృతి వనం' అనే పేరుతో యాడిక గ్రామానికి చెందిన శంకర రావు సేకరించి వాటిని దగ్గరలో ఉన్న చీపురుపల్లి, గరివిడి, రాజాం పట్టణాలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు.

చేదోడు వాదోడుగా..

ప్రకృతి సేద్యం చేస్తున్న రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అన్ని విధాలా చేదోడు వాదోడుగా ఉంటున్నారు. పంటలకు కావాల్సిన పోషకాలు, తెగుళ్లు, చీడపీడ ల నివారణకు రసాయన ఎరువుల స్థానంలో వినియోగించాల్సిన ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలు, ఫల పత్రదావణాల తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతులతో సామూహికంగా కషాయాలు, జీవామృతాలు, ఫల పత్ర ద్రావణాలు తయారు చేయించడంతో పాటు వాటిని వినియోగించే విధానాన్ని వివరిస్తున్నారు.

రెండు ఎకరాల్లో సాగుచేస్తున్నా..



రెండు ఎకరాల పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయల పంటలను సాగుచేస్తున్నాను. ఈ విధానంలో సాగు చేసిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.పంట ఉత్పత్తులను ఇంటి అవసరాలకు వినియోగించడంతో పాటు మిగిలిన వాటిని మార్కెట్‌లో విక్రయిస్తున్నాం. ఈ విధానంలో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలకు మంచి ధరలు పలుకుతున్నాయి. ప్రజలకు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు అందించాలనే లక్ష్యంతో ప్రకృతి సేద్యం చేస్తున్నాం. చుట్టు పక్క గ్రామాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్న రైతుల నుంచి కూరగాయలను సేకరించి చీపురుపల్లి, గరివిడి, రాజాం, అప్పుడప్పుడు విజయనగరం సరఫరా చేస్తున్నాం.

– ఎలకల శంకరరావు, రైతు, యాడిక గ్రామం

పట్టించుకునే వారేరి...?


మురికిపట్టి మరకలతో కనిపిస్తున్న దేవస్థానం ఆర్చ్

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందింది. ఇక్కడ ఏటా అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహిస్తుంటారు. మూడు రోజుల పాటు జరిగే జాతరకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, ఒడిస్సా ప్రాంతాల నుంచి లక్షల్లో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ ఏడాది మార్చి 2, 3, 4 తేదీల్లో జాతర జరగనుంది. అయితే జాతర విషయంలో హడావుడి కనిపించడం లేదనే చర్చ స్థానికంగా జరుగుతోంది. అమ్మ వారి దేవస్థానం వరకు రంగులు వేయించుకోలేని పరిస్థితుల్లో దేవదాయశాఖ ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దేవస్థానం ఆర్చ్ మురికి పట్టిన మరకలతో కళాహీనంగా దర్శనమిస్తోంది. దేవస్థానం మండపం స్తంభాలు కూడా ధూళి పట్టి కనిపిస్తు న్నాయి. దేవదాయశాఖ వెన్నంటే ఉండి జాతరను విజయవంతం చేసేందుకు ఆలయ కమిటీ కూడా లేకపోవడంతో అంతా చప్పగా ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. జాతర నిర్వహణ చూస్తున్న అధికార పార్టీ నాయకులు కూడా ఆలయానికి రంగులు వేయించేలా శ్రద్ధ పెట్టడం లేదని భక్తులు మండిపడుతున్నారు.

పీడీఎఫ్ అభ్యర్థి తరఫున ప్రచారం


ఇంటింట ప్రచారం చేస్తున్న యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు

వేపాడ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న విజయగౌరికి మద్దతుగా మండలంలోని బొద్దాం, కొత్తబొ ద్దాం, ఓబలయ్యపాలెం తదితర గ్రామాల్లో యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు ఆదివారం ప్రచారం చేశారు. ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు చల్లా జగన్, యూటీఎఫ్ నాయకులు ఇమంది జగదీశ్వరరావు, ఎం.సతీష్,తదితరులు పాల్గొన్నారు.

పుణ్యగిరి జాతరకు ప్రత్యేక బస్సులు

శృంగవరపుకోట: శివరాత్రి సందర్భంగా పుణ్యగిరి జాతరకు వచ్చే భక్తుల కోసం స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్ సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కె.రమేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ ఉదయం 4.30 గంటల నుంచి 27వ తేదీ గురువారం సాయంత్రం వరకు ఎస్.కోట డిపో నుంచి పుణ్యగిరి, సన్యాసయ్యపాలెం దేవస్థానాలకు బస్సులు నడుపుతున్నామని పేర్కొన్నారు. పుణ్యగిరికి 15 బస్సులు, సన్యాసయ్యపాలెంకు 3 బస్సులు నడుపుతామని, 26వ తేదీ రాత్రి అంతా బస్సులు తిరుగుతాయని స్పష్టం చేశారు. యాత్రికుల రద్దీని బట్టి బస్సులు పెంచడంతో పాటు సమాచార కేంద్రాలు, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌లు ఏర్పాటు చేస్తామని వివరించారు. భక్తులు నమ్మకమైన, సౌకర్యవంతమైన ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

ప్రయాణం.. నరకప్రాయం


పూడివానిపాలెం సమీపంలో గోతులు తేలిన రోడ్డు

లక్కవరపుకోట: మండలంలోని మార్లాపల్లి నుంచి లింగంపేట మీదుగా సీతాగొర్లెవానిపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు గజానికోగొయ్యితో అత్యంత అధ్వానంగా తయారైంది. సుమారు ఏడు కిలోమీటర్ల మేర రోడ్డులో ఎక్కడికక్కడ గోతులు తేలింది. ఈ రోడ్డులో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణాలు సాగి స్తుంటాయి. రోడ్డు కొన్నిచోట్ల పూర్తిస్థాయిలో కోతకు గురైయింది. సంక్రాంతి పండగ నాటికి ప్రజలు గోతు లు లేని రోడ్లు చూస్తారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,కూటమి నాయకులు ఊదరగొట్టా రు. కానీ వారి మాటలు కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో రోడ్ల మరమ్మతులకు నోచుకోవడం లేదు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని మార్లాపల్లి, లింగంపేట, సీతాగొర్లెవానిపాలెం గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.


మార్లాపల్లి సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డు


లింగంపేట సమీపంలో రోడ్డుపై గోతులు

ఉల్లాసంగా..ఉత్సాహంగా..


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చీపురుపల్లి: స్థానిక శ్రీనివాస జూనియర్ కళాశాల వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలతో సందడి చేశారు. చదువులో రాణిస్తూ ఉత్తమ మార్కులు సాధిస్తున్న వారికి కళాశాల యాజమాన్యం జ్ఞాపికలు అందజేసింది. దత్తసాయి మందిర నిర్వాహకులు తంగుడు రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ఏ.డి.ఎన్.ఎస్.వి.ప్రసాద్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు


అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

బొండపల్లి: తీవ్ర ఉత్కంఠ, అయోమయం నడుమ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను ప్రభుత్వం ఆదివారం నిర్వహించింది. మండలంలోని గొట్లాం గ్రామం వద్ద ఉన్న శ్రీగాయత్రీ కళాశాల కేంద్రంగా నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ కేంద్రంలో 480 మంది అభ్యర్థులు పరీక్ష లు రాయాల్సి ఉండగా ఉదయం నిర్వహించిన పరీక్షకు 341 మంది, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 339 మంది అభ్యర్థులు హాజర య్యా రు. గంటముందుగా అభ్యర్థులను పోలీసులు క్షుణ్ణం గా పరిశీలించి కేంద్రంలోకి అనుమతించారు. కేంద్రం చుట్టు పక్కల ప్రాంతాల్లో 144 సెక్ష న్ అమలు చేశారు. గజపతినగ రం సీఐ జి.ఏ.వి.రమణతో పాటు బొండపల్లి, ఆండ్ర ఎస్‌ఐలు యు.మహేష్, కె.సీతారామ్‌తో పాటు 20 మం ది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. తహసీల్దార్ డోల రాజేశ్వరరావు పర్యవేక్షించారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం


మహిళలకు అవగాహన కల్పిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి మోహన్‌రావు

గంట్యాడ: గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని డివిజనల్ పంచాయతీ అధికారి మోహన్‌రావు అన్నారు. రామ వరం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ఆదివారం చేపట్టిన స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇళ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. నివాసాల మధ్య, వీధి కాలువల్లో చెత్త పారబోయవద్దని, తడి,పొడి చెత్తను డస్ట్‌బిన్‌లలో వేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. ఈఓపీఆర్డీ ఆర్.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

యోగా, భగవద్గీత తరగతులు



మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకునే మార్గం యోగా, ధ్యానం, మన సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించుకునే సాధనం భగవద్గీత సాధన అని ఎస్.కోటకు చెందిన మోక్షవిద్య యోగ మందిర్ వ్యవస్థాపకులు శీలా కోటేశ్వరరావు చెప్పారు. భర్తాపురం వెంకటేశ్వరస్వామి ఆల యంలో విద్యార్థులకు ఉచిత యోగా, ధ్యాన శిక్షణ, భగవద్గీత తరగతులను ఆదివారం ప్రారంభించారు. పిల్లల్లో ధారణ, జ్ఞాపకశక్తి, రోగనిరోధకశక్తి పెరిగేందుకు అనుసరించాల్సిన ఆసనాలు, ప్రాణాయామ పద్ధతులను నేర్పించారు. సనాతన ధర్మాన్ని పునః ప్రతిష్ఠ చేయడం వల్లనే శాంతియుత, ఆరోగ్య జీవనం సాధ్యమని ఇందుకోసం ప్రతి ఇంట భగవద్గీత వినిపించాల్సిన సమయం ఆసన్నమయ్యిందని కోటేశ్వరరావు అన్నారు. ప్రతీ ఆదివారం శ్రీవారి సన్నిధిలో విద్యార్థులకు ఉచితంగా భగవద్గీత పఠనం, యోగా, ధ్యానం సాధనపై శిక్షణ ఇస్తున్నామని, ఇందుకు సహకరిస్తున్న టెంపుల్ ట్రస్టీ కె.జయవిష్ణుకు ధన్యవాదాలు తెలిపారు.

– శృంగవరపుకోట

ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు



చామలాపల్లి గ్రామంలో సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఎడ్లు పోటీల్లో పాల్గొనగా.. వావిలపాడుకు చెందిన గండి వెంకటరావు ఎడ్లు ప్రథమస్థానంలో నిలిచాయి. వరుసగా తొమ్మిదిస్థానాల్లో నిలిచిన ఎడ్లకు సంబంధించిన యజమానులకు గ్రామసర్పంచ్, పెద్దలు, దాతలు నగదు బహుమతులు అందజేశారు. అలాగే సుబ్రహ్మణ్యస్వామి,ఆంజనేయ స్వామి వార్లకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

– వేపాడ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



భైరీపురం గ్రామంలోని బాదంపెంటయ్య జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆపాఠశాల వేదికగా ఆదివారం జరిగింది. పాఠశాల విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత ఉన్నత చదువులు చదువుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా 28 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, యోగక్షేమాలు, కుటుంబ జీవితం గురించి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో వారికి చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.

– మెరకముడిదాం

బాల్య వివాహాలు నేరం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మహిళా సంక్షేమశాఖ రక్షణాధికారి రామకోటి

చీపురుపల్లి: బాల్య వివాహాలు చేసుకోవడం, ప్రోత్సహించడం చట్ట రీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బాలిక, మహిళా సంక్షేమశాఖ రక్షణాధికారి బి.రామకోటి చెప్పారు. పట్టణంలోని బీసీ సంక్షేమ బాలికల వసతిగృహంలో ఆదివారం సాయంత్రం బాల్య వివాహాల నిర్మూలన చట్టంపై అవగా హన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినిలకు ప్రతిభా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా ఎవరైనా బాల్య వివాహాలు జరి పేందుకు ఒత్తిడి చేసినా, ప్రోత్సహించినా 1098, 181, 100 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందిం చాలన్నారు. తక్షణమే అధికారులు వచ్చి బాల్య వివాహాలు నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఆడ పిల్లల కు ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చినా టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. వసతిగృహ సంక్షేమాధికారి ఎస్.అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

జీడి పంటకు మద్దతు ధర కల్పించాలని వినతి


ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న రైతు,వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు

లక్కవరపుకోట: జీడి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించేలా చూడాలని రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఎమ్మె ల్యే కోళ్ల లలితకుమారికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యేను ఆమె నివాసంలో కలిసి రైతుల సమస్య లను వివరించారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గొంప కృష్ణమూర్తి మాట్లాడుతూ జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. ఎన్నో గిరిజన కుటుంబాలు జీడిపంటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని, గిట్టుబాటు ధర, కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారుల చేతిలో నిలువునా మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 80 కిలోల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని, ప్రభుత్వ కొనుగో లు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో గిరిజన కార్పొరేషన్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. అలాగే ప్రాంతాల వారీగా జీడి పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు, సీఐటీయూ నాయకులు తరిణి వెంకటరమణ,తదితరులు పాల్గొన్నారు.